
క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు

సింహాచలం: అడవివరం లోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

దుర్గమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మాజీ సర్పంచ్ రామునాయుడు తదితరులు

పరవాడ: స్థానిక యంగ్‌మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతబయలు ప్రాంతంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి వాల్‌పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు సోమవారం రాత్రి ఆవిష్కరించారు. 11 రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. రోజూ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. మహిళలకు ముగ్గులు పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కూండ్రపు చినబాబు, రెడ్డి నారాయణరావు, గండి ఈశ్వరరావు, సిద్ధనాతి దేముడు, బొడ్డు అచ్చింనాయుడు, వి.సూరిబాబు, గండి సురేష్, కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


కాలుష్య నియంత్రణపై ఎన్టీపీసీకి ఎమ్మెల్యే లేఖ



పంచకర్ల రమేష్‌బాబు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ నుంచి ఉత్పత్తి అవుతున్న బూడిద కాలుష్యాన్ని నియంత్రించడానికి యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సూచించారు. ఈ మేరకు ఎన్టీపీసీ అధికారులకు పంపిన లేఖలో బూడిద ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని ప్రస్తావించారు. ఎన్టీపీసీ నుంచి బూడిద తరలించే భారీ వాహనాలతో రోడ్లన్నీ ధ్వంసమవడమే కాకుండా పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. వాహనాల ద్వారా ఎగసిపడుతున్న ధూళి వాతావరణంలో కలిసి ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తోందన్నారు. ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బూడిద రవాణాలో వాహనాలపై రక్షణ కవర్లు కట్టడంతోపాటు, రోడ్ల పునరుద్ధరణ, కాలుష్య నియంత్రణకు సత్వర చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



కొల్లి బాబూరావు (ఫైల్)

పరవాడ: యలమంచిలి–పరవాడ రహదారి రావాడ శివారు ధర్మారాయుడుపేట కూడలిలో సోమవారం రాత్రి లారీ ఢీకొట్టిన ఘటనలో అచ్యుతాపురం మండలం దొప్పెర్లకు చెందిన కొల్లి బాబూరావు(54) మృతిచెందాడు. పరవాడ పోలీసుల తెలిపిన వివరాలు.. దొప్పెర్ల గ్రామానికి చెందిన బాబూరావు ఫార్మాసిటీలోని ఓ పరిశ్రమలో కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడు విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై సోమవారం రాత్రి 9.30 సమయంలో స్వగ్రామానికి బయల్దేరాడు. ధర్మారాయుడుపేట జంక్షన్ వద్దకు రాగానే అచ్యుతాపురం నుంచి పోర్టుకు వెళ్తున్న లారీ బాబూరావు వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో బాబూరావు అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నామని సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు.

అప్పన్న ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



అమ్మవార్లకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో మంగళవారం నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో శ్రీ రామాయణ నవరాత్రి పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలోని హంసమూలన పారాయణదారులు రామాయణ నవరాత్రి పారాయణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. సాయంత్రం చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకిలో వేంజేపచేసి ఆలయ బేడా మండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. విశేష హారతులందించారు. వచ్చేనెల 1 వరకు ప్రతీ రోజూ ఉదయం స్వామి సన్నిధిలో రామాయణ పారాయణం, సాయంత్రం అమ్మవార్లకు తిరువీధి ఉంటుందని దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధం.. మూణ్నాళ్ల ముచ్చటే!



దుకాణాల వద్ద పాలిథిన్ కవర్ల వినియోగం



- పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోని ప్లాస్టిక్ నిషేధ చర్యలు
- కిరాణా, చేపలు, మాంసం దుకాణాల్లో యథేచ్ఛగా వినియోగం
- సాధారణ తనిఖీలు కూడా నిర్వహించని అధికార యంత్రాంగం
- ప్లాస్టిక్ నిషేధంపై 'గ్రీన్ క్లైమేట్' అలుపెరగని పోరాటం

ప్లాస్టిక్.. మన నిత్య జీవితంలో ఓ భాగమైంది. బకెట్లు, డబ్బాలు, కవర్లు ఇలా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ లేని బతుకును ఊహించడం కష్టమే. మరీ ముఖ్యంగా పలుచని(తక్కువ మైక్రాన్ల) ప్లాస్టిక్ కవర్ల వాడకంతో పర్యావరణానికి పెను ప్రమాదమని పర్యావరణవేత్తల ఆందోళన. దీంతో ఈ ఏడాది నుంచి ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే దాని అమలు మాత్రం ఆరంభ శూరత్వంగానే మారింది. పెందుర్తిలో ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా కనిపిస్తోంది.



దసరా సెలవులకు వెళ్తున్న హాస్టల్ విద్యార్థులకు గుడ్డ సంచులను అందిస్తున్న గ్రీన్‌క్లైమేట్ ప్రతినిధులు

పెందుర్తి: ఈ ఏడాది జనవరి 1 నుంచి కేంద్ర ప్రభుత్వం 120 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పెందుర్తి జోన్ పరిధిలో జీవీఎంసీ, మండల అధికారులు ఆరంభంలో చాలా హడావుడి చేశారు. అయితే 9 నెలలు గడుస్తున్నా ప్లాస్టిక్ నిషేధం వైపు ప్రజల అడుగులు ఇంకా పూర్తిస్థాయిలో పడలేదనే చెప్పొచ్చు. ముఖ్యంగా కిరాణా, మాంసాహార దుకాణాలతో పాటు టీ దుకాణాలు, చిన్నచిన్న హోటళ్లలో ఇంకా పూర్తిస్థాయిలో వాటినే వినియోగిస్తున్నారు.

తనిఖీలు ఏవీ..?

ఈ ఏడాది జనవరి 1 నుంచి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేసింది. అయితే కొద్ది రోజుల పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు నిషేధంపై నానా హంగామా చేశారు. ఇకపై ప్లాస్టిక్ కనిపించదు.. కనిపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ ఆ హెచ్చరికలు మూణ్నాళ్ల ముచ్చటే అయ్యాయి. ఇటీవల ప్లాస్టిక్ నిషేధంపై కనీస తనిఖీలూ లేవు. ఎప్పుడో అధికారులకు గుర్తొచ్చినప్పుడు చిన్నాచితకా దుకాణాలపై దాడులు చేసి వారికి జరిమానాలు వేసి, చేతులు దులిపేసుకుంటున్నారు.

గ్రీన్ క్లైమేట్ ఉద్యమం

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ విడనాడాలని స్వచ్ఛంద సంస్థ గ్రీన్ క్లైమేట్ గత కొన్నాళ్లుగా అలుపెరుగని ప్రయత్నం చేస్తోంది. సంస్థ ప్రతినిధులు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ.. పాలిథిన్ కవర్ల స్థానంలో వస్త్ర సంచులు వాడాలని కనీసం వారానికి ఒక్కసారైనా పెందుర్తి పట్టణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. దాంతోపాటు ప్రతి ఇంటికీ/అపార్ట్‌మెంట్‌కు వస్త్ర సంచుల్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అయితే ఆ సంస్థకు మాత్రమే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ప్లాస్టిక్ నిషేధం వైపు అడుగులు వేయాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

ప్లాస్టిక్‌తో తీవ్ర అనర్థాలు



ప్లాస్టిక్‌తో పర్యావరణ సమతుల్యం దెబ్బతింది. మేలుకోకపోతే తీవ్ర అనర్థాలు తప్పవు. గ్రీన్ క్లైమేట్ వాట్సాప్ టీం ద్వారా ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం చేస్తున్నాం. తల్లిదండ్రులకు అవగాహన కోసం దసరా సెలవులకు ఇళ్లకు వెళ్తున్న హాస్టల్ విద్యార్థులకు గుడ్డ సంచుల్ని ఇచ్చి పంపించాం.

– సత్యవతి, ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి

ఇది సామాజిక బాధ్యత



ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు అనేకం. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తోంది. ఆహార పదార్థాలు ప్లాస్టిక్ కవర్లలో తీసుకురావడం వలన దీర్ఘకాలిక రోగాలు సంక్రమించే అవకాశాలు ఎక్కువ. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడాన్ని సామాజిక బాధ్యతగా చూడాలి.

– రేఖ, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి, పెందుర్తి

దాడులు చేస్తున్నాం



హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో పాటు ప్లాస్టిక్ ఉత్పత్తిదారులకు నిషేధంపై వివరిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పర్యటించి చిరువ్యాపారులకు, ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కలిగిస్తున్నాం. నిషేధ ఉత్తర్వుల్ని పక్కాగా అమలు చేస్తాం. ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్ శంకరరావు, ఇన్‌చార్జ్ జెడ్సీ, జోన్–8

రైతుబజార్‌లో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం



రైతుబజార్ వరకు ప్లాస్టిక్ నిషేధంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగిస్తున్నాం. కాయగూరల కోసం పాలిథిన్ కవర్ల అమ్మకాలను నిషేధించాం. వినియోగదారులు ఇంటి నుంచి సంచులు తెచ్చుకోవాలని సూచిస్తున్నాం. రైతులకు కూడా ప్లాస్టిక్ వాడొద్దని గట్టిగా చెబుతున్నాం.

– కె.పద్మావతి షర్మిల, ఈవో, రైతుబజార్, పెందుర్తి

రేషన్ సరకులు అందించాలని వినతి



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న కాలనీల వాసులు

పరవాడ: జేఎన్ఎన్‌యూఆర్‌ఎం, టిడ్కో కాలనీల ప్రజలకు రేషన్ డిపో ద్వారా సరిపడారేషన్ సరఫరా చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. రెండు కాలనీల్లో రేషన్ కార్డులకు అవసరమైన బియ్యాన్ని డిపోలో నిల్వ చేయని కారణంగా కార్డుదారులందరికీ బియ్యం అందడం లేదన్నారు. కాలనీల ప్రజలకు అవసరమైన సరకులను రేషన్ డిపో ద్వారా సరఫరా చేయాలని అధికారులను కోరారు. ఈ మేరకు పరవాడ తహసీల్దార్ బి.నాగరాజుకు ఐద్వా ఆధ్వర్యంలో కాలనీల ప్రజలు మంగళవారం వినతి పత్రం అందించారు. కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగరాజు భరోసానిచ్చినట్లు మాణిక్యం తెలిపారు. కార్యక్రమంలో సరోజిని, మంగమ్మ, వరలక్ష్మి, లక్ష్మమ్మ, కనకమహాలక్ష్మి, రమణమ్మ, ఈశ్వరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

భారతీయ సంప్రదాయ వైద్య విధానం ఆయుర్వేదం



ఆయుర్వేద వైద్యంపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్

సబ్బవరం: ఆయుర్వేదం భారతీయ సాంప్రదాయ వైద్య విధానమని, ఇది అన్ని రకాల రోగాలను నయం చేస్తుందని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఆయుర్వేద దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయుర్వేదం ప్రాచీన కాలం నుంచి నేటి వరకూ అన్ని రకాల వ్యాధులను నయం చేస్తోందన్నారు. భారతీయ ఆహార అలవాట్లతో మిళితమైన వైద్య విధానం కేవలం ఆయుర్వేదం మాత్రమేనన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆయుర్వేదాన్ని మనం కూడా కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు రజని, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ లెక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం–రాయపూర్ ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణ పనుల పరిశీలన



అధికారులతో కలెక్టర్ విజయ కృష్ణన్, సంతోష్‌కుమార్ యాదవ్

సబ్బవరం: మండలంలోని సబ్బవరం–రాయపూర్ ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణ పనులను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆలిండియా నేషనల్ హైవేస్ ఛైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. మండలంలోని 130 సీడీ–460 కి.మీ. వద్ద రోడ్డు విస్తరణ పనులపై హైవే సిబ్బందితో చర్చించారు. పనుల్ని త్వరతగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారి వెంట ఎన్‌హెచ్–16 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి, అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ అయేషా, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ రోహిత్ కుమార్, నేషనల్ హైవే బోర్డు మెంబర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీఐ ప్రధాన కార్యదర్శిగా నాగరాజు



నియామక పత్రం అందుకుంటున్న నాగరాజు

పెందుర్తి: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా(హెచ్‌ఆర్‌సీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెందుర్తికి చెందిన వాల్మీకి నాగరాజు నియమితులయ్యారు. వేపగుంట సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు నాగరాజుకు జాతీయ ప్రధాన కార్యదర్శి చారేంద్ర నియామకపత్రం అందించారు.

కార్యక్రమంలో హెచ్‌ఆర్‌సీఐ ప్రతినిధులు గోవిందరావు, రవికిషోర్, రాజు, శ్యామలరావు, వెంకటకృష్ణ, చిరంజీవి, టిల్లు తదితరులు పాల్గొన్నారు.

గాయతాం త్రాయతే ఇతి గాయత్రి



పెందుర్తి అయ్యప్పస్వామి దేవాలయంలో అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



పెందుర్తి పాత ప్రభుత్వాస్పత్రి వద్ద అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ నేతలు



సాధూమఠం సమీపంలోని మహాకామేశ్వరి పీఠంలో 'బాలా'పూజలో పాల్గొన్న చిన్నారులు



సప్తగిరినగర్‌లో ధాన్యలక్ష్మిగా అలివేలు మంగమ్మ



విజినిగిరిపాలెంలో గాయత్రీదేవిగా ఉమాదేవి

గాయతాం త్రాయతే ఇతి గాయత్రి.. గానంతో మనసారా కొలిస్తే చాలు.. అన్నివేళలా కాపాడేది గాయత్రి అని పండితులు చెప్తారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం అమ్మవారిని పలు దేవాలయాలు, మండపాల్లో గాయత్రి, ధాన్యలక్ష్మి, బాలా త్రిపుర సుందరి అలంకరణలో కొలిచారు. జై దుర్గ.. జైజై దుర్గ అంటూ అమ్మవారి శరణు ఘోషతో హోరెత్తించారు.

- గాయత్రి, ధనలక్ష్మి, బాలాత్రిపురసుందరిగా దుర్గమ్మ
- అమ్మవారి ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్ల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రిమాత ఆలయంలో భారీఎత్తున కుంకుమార్చన చేశారు. బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు. ఆలయ ధర్మకర్త సరస్వతుల నరసింహమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

- సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో భారీఎత్తున కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపారు. ధాన్యలక్ష్మిగా అమ్మవారిని అలంకరించారు.
- మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త డీవై చైనులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.
- ప్రశాంతినగర్‌లోని కనకదుర్గమ్మ బాలాత్రిపుర సుందరిగా పూజలందుకున్నారు. సామూహిక సహస్ర కుంకుమార్చనలు జరిగాయి.
- పెందుర్తి సాధూమఠం వద్ద ఉన్న మహాకామేశ్వరీ పీఠంలో అమ్మవారికి ముందుగా రుద్రాభిషేకం, అఖండ క్షీరాభిషేకాలు చేశారు. 'బాలా'గా జగన్మాతను అలంకరించారు. బాలోపాసన వైభవంగా జరిపి, చిన్నారులకు పీఠం ప్రతినిధులు కానుకలు అందించారు.



పెందుర్తి మహాకామేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భవానీ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.
- సుజాతనగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని పంచముఖ గాయత్రిగా అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- పెందుర్తి అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో దుర్గాదేవి బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు చేశారు.
- స్థానిక పాత ప్రభుత్వాసుపత్రి సమీపంలో కొలువుదీరిన దుర్గాదేవిని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు మెంటి మహేష్, కిల్లి అప్పారావు, లాలం అప్పలనాయుడు, నరవ బంగారునాయుడు, రాజు, లాలం మోహనరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సింహాచలం: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 98వ వార్డు పరిధి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన ఉమాదేవి అమ్మవారు మంగళవారం గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించి, గాయత్రీదేవిగా అలంకరించారు. భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ పూజలు నిర్వహించారు.

- అడవివరంలోని గాంధీనగర్‌లో హనుమాన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవరోజు అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.
- అప్పన్నపాలెంలో కొలువుదీరిన భూలోకమాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమపూజలు, ధూపసేవ నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.
- సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో వేంజేసిన బాలాత్రిపురసుందరీదేవికి విశేష కుంకుమ పూజలు జరిపారు. పరమేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు.


కళాసీలకు పూర్తి చార్జీలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న కళాసీలు

పెందుర్తి: సివిల్ సప్లెస్ గొడౌన్‌లో పనిచేస్తున్న కళాసీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు కాంట్రాక్టర్ చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు డిమాండ్ చేశారు. పెందుర్తిలో ఉన్న సివిల్ సప్లెస్ గొడౌన్ వద్ద కళాసీలతో కలిసి కాంట్రాక్టర్ తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ కళాసీలకు లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.125 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నిబంధనలను కాంట్రాక్టర్ తుంగలో తొక్కి, కేవలం రూ.100 మాత్రమే చెల్లిస్తున్నాడని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తి మొత్తం చెల్లించకపోతే త్వరలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.సన్యాసిరావు, ఎం.వెంకటరావు, కాసుబాబు, రొంగలి దేవుడుబాబు, కళాసీలు దమ్మురాజు, అప్పలనాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

'ఎకో కోచ్ వినూత్న విధానం'



ఎకో కోచ్ ప్రాజెక్టుతో విద్యార్థులు

పెందుర్తి: స్థిరమైన రైల్వే టెక్నాలజీ కోసం ఎకో కోచ్ ఒక వినూత్న విధానమని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు రూపొందించిన ఎకో కోచ్ ప్రాజెక్ట్ వర్క్‌ను పరిశీలించారు. పాసింజర్ రైల్ కోచ్‌లలో సౌర ఫోటోవాల్టిక్ టెక్నాలజీని సమగ్రపరచడంలో దీన్ని ఉపయోగిస్తారని తెలిపారు. సౌర ఫలకాలను ఉపయోగించడం ద్వారా ఈ వ్యవస్థ పునరుత్పాదక శక్తినిస్తుందన్నారు.